# ఒకటి ఒంటరి అంకె

## మల్లాది వెంకట కృష్ణమూర్తి



***1978 లో మల్లాది గారి కలం నుంచీ వెలువడిన నవల***

***(గత సంచిక తరువాయి)***

**త్రిపురం ముందుగదిలోని తెల్లరంగు బల్లమీద కూర్చుండిపోయింది.**

ఇరవై నిమిషాల తర్వాత నీరసంగా వచ్చాడు రామకృష్ణ బయటికి. మొహం కడుక్కున్న గుర్తుగా గెడ్డమంతా తడిగా ఉంది.

"ఈవిడే" చెప్పాడతను.

"థాంక్స్ త్రిపురం."

"మీ ఇల్లెక్కడ?" అడిగాడతను.

"ఇట్సాల్ రైట్ వెళ్ళగలను"

"థాంక్స్ వన్సెగయిన్."

సహాయం చేసిన అతను వెళ్ళిపోయాడు.

బయట ఆగివున్న ఆటోలో ఎక్కారిద్దరూ.

"బస్టాప్ లో చూశాను మిమ్మల్ని అకస్మాత్తుగా... "

"నాకు అపుడప్పుడు ఫిట్స్ వస్తూంటాయి."

"ఐయామ్ సారీ! నాకు తెలియదు."

"చిన్నపటినుండి ఉంది హెరిడిటరీ."

మౌనంగా ఉండిపోయింది త్రిపురం.

"ఈ సంవత్సరం ఇది రెండోసారి రావటం. నిన్న ఓ ఫ్రెండ్ ఇంట్లో వద్దన్నా బలవంతంగా నూనెతో చేసిన టిఫిన్ పెట్టారు. అదే అయుండొచ్చు కారణం."

"నూనె పడదా మీకు?"

"నూనె సాధ్యమయినంతవరకు దూరంగా ఉంచుతాను."

ఇదరూ మౌనంగా ఉండిపోయారు చాలాసేపు ఏం జరగనట్లే మామూలుగా ఉన్నాడు రామకృష్ణ ఆటోలోంచి బయటికి చూస్తూ. త్రిపురానికి అంతుబట్టలేదు రామకృష్ణ మనసులో ఆ సమయంలోని ఆలోచనలు.

తను చూడబట్టి సరిపోయింది! ఆ సమయంలో రోడ్ మీద ఎవరూ లేకపోతే? అసలు డాక్టర్ దగ్గరలో లేని గ్రామానికెప్పుడయినా వెళ్ళినప్పుడు అలా జరిగితే? భార్యతో సినిమాకి వెళ్ళి టిక్కెట్సుకి క్యూలో నిల్చున్నప్పుడు ఫిట్సు వస్తే? అంతా చూస్తుండగా భార్య తీసుకెళ్ళాలి వెంటనే ఆస్పత్రికి తప్పదు మరి. అంతా భార్యని జాలిగా చూస్తారు.

హెరిడిటరీ!

వంశపారంపర్యలో వచ్చే వ్యాధి ఇది. రేపు పుట్టబోయే పిల్లలకి కూడా సంక్రమించవచ్చు హిస్టీరియా, జీవితంలో మొదటిసారిగా తెలుసుకుంది త్రిపురం రోగిష్టి భర్తతో కాపురం సుఖంగా జరగదని.

"మిమ్మల్ని ఇంటిదగర దింపి వెళతాను నేను" అన్నాడు రామకృష్ణ.

"అబ్బే! ఇక్కడ దిగిపోతాను."

ఆ రాత్రి చాలాసేపు దృష్టి చదువు మీదకి పోలేదు త్రిపురానికి.

రాత్రి భోజనం చేస్తూ చెప్పింది వర్ధనమ్మకి యూనివర్శిటీ బస్టాప్ దగ్గర జరిగిన సంగతి!

ఆవిడ "అయ్యో పాపం మంచివాడు" అన్నది జాలిగా.

కాసేపాగి మళ్ళీ అన్నది వర్ధనమ.

"అతనికి భార్యగా దేముడు ఎవరిని రాసిపెట్టాడో, ఎక్కడుందో కాని పాపం దురదృష్టవంతురాలు."

✷✷✷

పరీక్షలు బాగా వ్రాసింది త్రిపురం. అనుకున్నట్లుగానే పేస్ అయింది. ఎం.ఏ ఫస్ట్‌క్లాసులో పాసయినవారు అతి కొద్దిమంది. రామకృష్ణ యూనివర్సిటీలో సెకండ్ వచ్చాడు.

త్రిపురానికి లభించింది గోల్డుమెడల్ ఆ సంవత్సరం.

"ఏం చేయదల్చుకున్నారు?" అడిగాడు రామకృష్ణ కంగ్రాచ్యులేషన్స్ తెల్పాక.

"పి.హెచ్.డి."

"నేనూ అదే అనుకుంటున్నాను."

"గుడ్"

"ఈ యూనివర్సిటీ కాదు. బాంబే వెళుతున్నాను."

"అదేం?"

"మా నాన్నగారు అక్కడో చిన్న వ్యాపారం పెడుతున్నారు. వెళ్ళటం తప్పదు."

మర్నాడు త్రిపురం ప్రొఫెసర్ పిలిచి చెప్పాడామెకు.

"బ్రిలియంట్ స్టూడెంట్స్ ఎప్పుడో కాని రారు. వాళ్ళని పిలిచి చెప్తూంటాను. తప్పకుండా పి.హెచ్.డి. చెయి. నేను నీ గైడ్‌గా ఉంటాను. సబ్జెక్టు నేనే ఇస్తాను. ఇప్పట్లో పెళ్ళి చేసుకునే ఆలోచన లేకపోతే చదువు కొనసాగించు. స్కాలర్ షిప్ తప్పకుండా వస్తుంది కాబట్టి మంచి అవకాశం ఇది."

"థాంక్స్ సర్. నేనూ చేద్దామనుకుంటున్నాను" అన్నది త్రిపురం.

"ఇంకా చదువుతావా?" అసహనంగా అడిగింది వర్ధనమ్మ ఆ రాత్రి తల్లికి ఆ సంగతి చెప్పాక.

"అవును. ఇంట్లో కూర్చుని ఏం చేయాలి. గోళ్ళు గిల్లుకుంటూ."

"నా కిష్టం లేదు."

"స్కాలర్ షిప్ వస్తుంది. మన పైసా కూడా ఖర్చు పెట్టాల్సిన అవసరం లేదు. అందరికీ వచ్చే అవకాశంకాదిది. మా ప్రొఫెసర్ పిల్చి మరీ చెప్పారు పి.హెచ్.డి. చేయమని"

"నీ ఇష్టం?"

"అయిదేళ్ళేగా ఇట్టే తిరిగిపోతాయి"

వర్ధనమ్మ కూతురి పెళ్ళికోసం ప్రయత్నాలు చేయసాగింది తీవ్రంగా. మొట్ట మొదటిసారిగా త్రిపురానికి, తనకి తగిన సంబంధం తీసుకురావటం ఎంత కష్టమో అనుభవపూర్వకంగా బాధపడసాగింది.

ఎం.లిట్ అయింది. డాక్టరేట్ చేస్తోంది. తన కాబోయే మొగుడు అంతకు తక్కువ చదువుకున్న వాడవకూడదు. కనీసం పి.హెచ్.డి. చేసుండాలి. ఇంకా ఎక్కువ చదివినా ఫర్వాలేదు. ఇంజినీర్, డాక్టర్ అయివుండాలి లేదా కాలేజీలో ప్రొఫెసర్ అయివుండాలి లేదా ఏదయినా ఓ రంగంలో వ్యాపారం, ఉద్యోగం ఉన్న స్థితిలో ఉండాలి అట్టే విద్య లేకపోయినా ఇలాంటి సంబంధాలు ఎక్కడో కాని ఉండవు. అయినా ప్రయత్నం చేయసాగింది వర్ధనమ్మ.

నలుగురు అయిదుగురు వచ్చి త్రిపురాన్ని చూసి వెళ్ళారు. ఏ సంబంధం కుదరలేదు. కొంతమంది అడిగిన కట్నం వర్ధనమ్మ భరించలేనంతగా ఉంది. అప్పటిదాకా వాళ్ళు తమ చదువుకోసం పెట్టిన ఖర్చంతా కట్నం రూపంలో తిరిగి సంపాదించుకుందామన్న దృష్టి కనబడింది ఆవిడకి.

చాలామందికి త్రిపురం నచ్చలేదు.

"చదువు నచ్చింది కాని పిల్ల ఇంకాస్త తెల్లగా ఉంటే బావుండేది" కొందరన్నారు.

"పెళ్ళయ్యాక అమ్మాయి వచ్చి మాతో ఉంటుంది. అప్పుడు మీరెక్కడుంటారు?" వర్ధనమ్మని ప్రశ్నించారు కొందరు సూటిగా.

త్రిపురానికి ఆ ప్రశ్న వేసిన వాళ్ళంటేనే అసహ్యం వేసింది. తన పెళ్ళి తనని తల్లినుంచి విడదీయడానికా?

"నేను పెళ్ళికాకుండానైనా ఉంటాను కానీ అలాంటి వాళ్ళని పెళ్ళిచేసుకోను. ఇంతకాలం ఒకరినొకరం కలిసి ఉన్నాం. ఎంత చదువుకుంటే మాత్రం ఆ మాత్రం అర్ధం చేసుకోలేకపోతే ఎందుకా చదువు?" ఆవేశంగా అన్నది త్రిపురం వాళ్ళు వెళ్ళాక.

ఇంజనీర్స్, డాక్టర్స్, పెద్ద పెద్ద కంపెనీల్లో పనిచేసేవాళ్ళు డజనుమందిని పైనే చూసింది వర్ధనమ్మ. కాని ఎవరూ నచ్చలేదు త్రిపురానికి. త్రిపురానికి నచ్చిన వాళ్ళకి త్రిపురం వాళ్ళకి నచ్చకపోవటమో కట్నం దగ్గర ఇబ్బందులో ఎదురయ్యాయి.

విసుగొచ్చి సంవత్సరంన్నర దాటాక ఓ రోజు తల్లితో చెప్పింది త్రిపురం.

"ఇక నా కోసం సంబంధాలు వెదకకు. నేను పి.హెచ్.డి పూర్తయ్యేదాకా పెళ్ళిచేసుకోను. నేను పి.హెచ్.డి పూర్తయేదాకా పెళ్ళిచేసుకోను."

"నువ్వింత చదవకపోయినా బావుండేది" అన్నది ఆవిడ.

"ఏం? ఏమయింది నా చదువువల్ల."

"బి.ఏ.తోనే నా మాట విని ఆపేసి వుంటే ఈ పాటికి నీకు పెళ్ళయిపోయేది. గంతకు తగ్గ బొంత అన్నట్లుగా ఏ బేంక్‌లో క్లర్కో లేదా నీ చదువుకు పెట్టిన డబ్బు కట్నం రూపంలో ఇచ్చి వుంటే ఆఫీసరో దొరికేవాడు. నువు ఎం.ఏ చదవటంతో ఇప్పుడు నిన్ను చేసుకునేవాడు కూడా తప్పనిసరిగా పోస్టు గ్రాడ్యుయేట్ అయివుండాలి. డాక్టరేట్ చేస్తున్నావు కాబట్టి ఇప్పుడు పోస్టు గ్రాడ్యుయేట్ అయినా పనికిరాడు."

త్రిపురానికి అర్ధమైంది తన కాబోయే భర్తకి ఉండాల్సిన క్వాలిఫికేషన్స్ గల వ్యక్తులు అరుదుగా దొరుకుతారని. ఒక విధంగా తనే అలాంటి సమస్య తెచ్చిపెట్టుకుంది. ఎక్కువ చదువులు చదివి.

"నీ కన్నా పెద్ద చదువు చదివినవాళ్ళకి ఎన్నెన్నో కోరికలు పిల్ల ఎంతో అందంగా ఉండాలి. సంసార పక్షంగా ఉంటే చాలదు. షో కేస్‌లో బొమ్మలాగా ఉండాలి సొసైటీలో తన భార్యగా పదిమందికి పరిచయం చేయడానికి. వాళ్ళకి మనలాంటి ఓ మాదిరి మధ్య తరగతి కుటుంబాల నుంచి వచ్చిన అమ్మాయిలు పనికిరారు. పెద్ద ఉద్యోగంలో ఉన్నవాళ్ళకు, దాహం తీరేలా కట్నం పోసి ఎమ్సెల్సీనో పి.యు.సినో పాస్ అయిన అమ్మాయిలనిచ్చే ధనికులకోసం చూస్తారు. నా భార్య కూడా నా అంత చదువుకుని ఉండాలి అని అనుకునేవాళ్ళు తక్కువ."

త్రిపురం మౌనంగా వింటూండిపోయింది.

"ఎవరైనా ముందుకు వచ్చినా ముప్పై అయిదు నలభై మధ్య మొదటి భార్య పోయిన వాళ్ళే అలాంటి సంబంధాలు కూడా వచ్చాయిగా మధ్యవర్తులద్వారా."

మొదటిసారిగా తన పెళ్ళిగురించి అన్ని అనుమానాలు, అభిప్రాయాలు వర్ధనమ్మ వ్యక్తం చేయడంతో త్రిపురం మనసు వికలమయింది. నిజానికి త్రిపురం సీరియస్‌గా అంతదాకా తన వివాహం గురించి ఆలోచించుకోలేదు. తన భర్త ఎలా ఉండాలి? ఎలాంటి వాడిని తాను భర్తగా కోరుకుంటోంది అన్న విషయం గురించి ఆలోచించుకోలేదు సీరియస్‌గా.

"ఇంకా చదవాలి. గోల్డుమెడల్ సంపాదించుకోవాలి. డాక్టరేటు అనిపించుకోవాలి" అనే ఆలోచనే ఎప్పుడు.

"దయచేసి ఈ రోజునుంచి ఇక నా పెళ్ళి ప్రయత్నం చేయక నేను సహించను" అని చెప్పులు తొడుక్కుని బయటకు వెళ్ళిపోయింది త్రిపురం.

యూనివర్శిటీ లైబ్రరీలో కూర్చున్నా తల్లి చెప్పిన మాటలు గింగురుమంటున్నాయి త్రిపురం చెవిలో.

మొదటినుంచీ తను అందరు ఆడపిల్లల్లా కాదు. పెళ్ళి గురించి ఎదురుచూడలేదు. కాబోయే భర్తగురించి కలలు కనలేదు. అసలు బట్టల గురించి కూడా ఆలోచించిలేదు. తోటి విద్యార్థినులు రకరకాలుగా బట్టలు ధరించి వస్తూంటే తను కాటను చీరలు కడుతూ వస్తోంది. ఒక్కసారి కూడా తల్లో పూలు పెట్టుకోలేదు.

ఏ కోణం నుంచి చూసినా, బహుశ తను అందరి ఆడపిల్లల్లా కాదు. తల్లి దృష్టిలో తను పెళ్ళిచేసుకునే అవకాశాన్ని దూరం చేసుకుంది.

లైబ్రరీలో కూర్చోలేక బయటికి వచ్చింది. యూనివర్శిటీ కాంపస్, ఆర్ట్సు కాలేజి బిల్డింగ్స్, తనకి ఆరేళ్ళగా ఎంతో సన్నిహితంగా పరిచయమైనఆ వాతావరణం మొత్తం ఒంకో విధంగా కనపడసాగింది త్రిపురానికి.

తన వైవాహిక జీవితాన్ని నాశనం చేసిన స్మశానవాటిక అనిపించింది త్రిపురానికి తొలిసారిగా ఆ ప్రదేశం. ఆటోలో ఓ సినిమాకి వెళ్ళిపోయింది, రిలాక్స్ అవడానికి.

## 9

త్రిపురం రీసెర్చి ముగిసింది.

అయిదేళ్ళుగా పడ్డ కష్టానికి ఫలితం లభించింది.

పి.హెచ్.డి డిగ్రీ లభించింది!

డాక్టరేటు అయింది త్రిపురం!

త్రిపురానికి గైడ్‌గా పనిచేసిన ప్రొఫెసర్ త్రిపురం చాలా సంతోషించాడు. మనస్ఫూర్తిగా అభినందించాడు త్రిపురాన్ని.

త్రిపురం తల్లి కూడా సంతోషించింది. సంతోషంతో పాటు ఆవిడకి దిగులు కూడా పట్టుకుంది. చదువులో చాలా దూరం వెళ్ళింది త్రిపురం. తిరిగి వెనక్కి తిరిగిరాలేనంత పై మెట్టుకి వెళ్ళింది.

అదే అంతస్తులో అదే స్థాయిలో ఉన వ్యక్తి కోసం వెదకడంతో ఆవిడ తలప్రాణం తోకకి వచ్చేలా ఉంది.

త్రిపురం మాత్రం నిశ్చింతగా ఉంది. పెళ్ళి కాలేదన్న దిగులులేదు. అవదేమోనన్న భయంలేదు. "ఎంతకాలం ఇలా బ్రహ్మచారిణిలా?" అనే బాధలేదు.

ఇరవై ఎనిమిది నిండి ఇరవై తొమ్మిది దాటుతోంది త్రిపురానికి. డాక్టరేట్ అవగానే త్రిపురం అంటే అభిమానం చూపించే ప్రొఫెసర్ చెప్పాడు ఒకరోజు.

"తర్వాత ఏం చేయదలచుకున్నారు?"

"అదే ఆలోచిస్తున్నాను."

"ఇదే యూనివర్శిటీలో చదువుకున్నారు. ఇక్కడే చేరి విద్యార్థులకు మీరు నేర్చుకున్న విద్యని బోధించవచ్చుగా."

"నేనూ ఉద్యోగం చేయాలనుకుంటున్నాను."

"వెరీగుడ్ మీకు లెచరర్ పోస్ట్ సూట్ అవుతుంది. ప్రొఫెసర్ అవచ్చు. రీడర్ అవచ్చు. విదేశాలకు వెళ్ళే అవకాశం కూడా కలగచ్చు.

"థాంక్స్. అప్లికేషను పెడతాను"

"వి.సి.తో మాట్లాడుతాను నేను. విష్ యు ఆల్ ది బెస్ట్. ఈసారి రెండు పోస్టులు ఖాళీ అయే అవకాశం ఉంది. ఇద్దరు రిజైన్ చేస్తున్నారట."

త్రిపురం ఆలోచనలతో వచ్చింది ఇంటికి. వర్ధనమ్మ డాక్టర్ దగ్గరకెళ్ళి
లైబ్రరీలో కూర్చోలేక బయటికి వచ్చింది. అప్పుడే మందులు తీసుకువచ్చింది.

"ఎలావుంది వంట్లో?" అడిగింది త్రిపురం.

"కాళ్ళు, చేతులు తిమ్మిర్లెక్కినట్లున్నాయి. బి.పి. చూశాడు. కొద్దిగా ఎక్కువయింది. మందులు రాసిస్తే తీసుకువస్తున్నాను." చెప్పింది ఆవిడ. త్రిపురం ఉద్యోగానికి అప్లికేషను పెట్టదలచుకున్న సంగతి చెప్పింది.

"మా ప్రొఫెసర్ రికమెండ్ చేస్తున్నారు. నువ్వేమంటావ్" అడిగింది.

"నీ ఇష్టం. నీకు ఉద్యోగం చేయాలనుంటే చెయ్యి. ఈ ఊరు వదిలి ఎక్కడో దూరంగా ఉద్యోగం చేయాల్సిన అవసరం కలగనంతకాలం చెయ్యి."

"అయితే అప్లికేషను పెడతాను."

"కాని ఎప్పుడు ఉద్యోగం కష్టంగా తోస్తే అప్పుడే రాజీనామా చెయ్యి. నువ్వు ఉద్యోగం చెయ్యకపోతే గడవదన్న చింతలేదు. ఇంట్లో ఉంటే విసుగు పుడుతుంది కాబట్టి రోజూ ఓ వ్యాపకం ఉంటుంది. ఆ మూడుముళ్ళు పడేదాకా. ఆ తర్వాత ఆయనిష్టం, నీ ఇష్టం."

త్రిపురానికి ఉద్యోగం వచ్చింది.

మొట్టమొదటిరోజు మూడో నెంబర్ బస్‌లో అలవాటయి ఆ బస్టాప్‌లో దిగి, ఎదురుగా కనబడుతున్న ఆర్ట్సు కాలేజీ బిల్డింగ్‌ని చూడగానే కొద్దిగా వణుకు, ఏదో తెలియని భావన కలిగాయి త్రిపురానికి. ఇంతకాలం కేవలం స్టూడెంట్‌లా ఆ కేంపస్‌లోకి అడుగుపెడుతూ వచ్చింది తను.

ఇవాళ్టినుంచి అకస్మాత్తుగా కొత్త బాధ్యతతో, లెక్చరర్‌గా ఆర్ట్సు కాలేజ్ బిల్డింగ్ లోకి అడుగుపెట్టాలి. తనకు చదువు చెప్పిన లెక్చరర్స్‌తో సమానంగా తనూ చదువు చెప్పాలి రోజూ క్లాసెస్ తీసుకోవాలి.

మొదటి క్లాస్ ఎం.ఏ. ఫస్టియర్ తీసుకుంది త్రిపురం.

ఇంతకాలం అటువైపు కూర్చుంది. ఇప్పుడు ఇటువైపు నిల్చుని మాట్లాడాలంటే ఏదో బెరుకు భయం. మొదటి క్లాసులోనే చక్కటి ఇంప్రెషన్ కోచ్ చేయాలి విద్యార్థులకి. లేకపోతే గమ్మత్తయిన నిక్ నేమ్స్ ఆలోచిస్తారు. వాళ్ళు వెళ్ళిపోయినా, లెక్చరర్ సర్వీసులో ఉన్నంతకాలం ఆ పేరు అలా ఒక బేచ్ నుంచి మరో బేచ్‌కి అందజేయబడుతూ శాశ్వతంగా నిల్చిపోతుంది.

షెల్లీ జీవితం గురించి చక్కగా చెప్పింది ఆ క్లాసులో చిన్న వ్యసులో షెల్లీ ఎలా మరణిచింది. ఎంత చక్కటి పొయిట్రీ వ్రాసిందీ ఉదహరించింది.

టైం అవగానే "థాంక్యూ లేడీస్ అండ్ జంటిల్‌మన్" అని బయటికి నడిచింది.

"ఎలావుంది మొదటి క్లాసు?" అడిగారు తోటి లెక్చరర్స్ చిరునవ్వుతో.

"ధైర్యం వచ్చింది" చెప్పింది త్రిపురం.

క్రమంగా అనుభవంతో పాటు చాలా సుళువులు తెలుస్తాయి. ఆల్ ది బెస్ట్" అన్నాడు త్రిపురం అంటే మొదటి నుంచి అభిమానం గల ప్రొఫెసర్.

ఒకరోజు క్లాసులో షేక్స్పియర్ గురించి లెక్చరరు చెపుతూండగా డిపార్టుమెంటల్ ప్యూను వచ్చి చెప్పాడు త్రిపురంతో.

"మీకు ఫోను వచ్చింది. ప్రొఫెసర్ గారు అర్జంటుగా రమ్మంటున్నారు."

"ఎక్స్‌క్యూజ్ మీ" అని క్లాసుకు చెప్పి త్రిపురం ప్రొఫెసరు దగ్గరకు వెళ్ళింది.

"ఐయామ్ సారీ త్రిపురం. మీరు వెంటనే ఇంటికి వెళ్ళండి" చెప్పాడాయన.

"ఏం జరిగింది?" అడిగింది త్రిపురం గాభరాగా.

"మీ అమ్మగారికి ఆరోగ్యం బావుండలేదా?"

"ఉహూ"

"ఆవిడ పడిపోయారని మీ పక్కింటివాళ్ళు ఫోన్ చేశారు. ఆ వార్త మీకు తెలియచేసి వెంటనే మిమ్మల్ని పంపమని చెప్పారు."

"గుడ్ హెవెన్సు, వెళుతున్నాను."

త్రిపురం బయటకు నడిచింది వేగంగా ఆటోలు కూడా లేవుఎక్కడా. తనకి తెలిసిన ఓ స్టూడెంట్‌ని చూసి ఆలోచన వచ్చి పిలిచింది.

"యస్ మేడమ్ !" అడిగాడతను దగ్గరకు వచ్చి.

"మీకు మోటార్ సైకిల్ ఉందనుకుంటాను?"

"అవును."

"మీకు క్లాసు లేకపోతే కొద్దిగా నన్ను నల్లకుంటలో డ్రాప్ చేస్తారా? అర్జెంటుగా ఇంటికి వెళ్ళాలి."

"తప్పకుండా. ఇక్కడే ఉండండి. బండి తీసుకువస్తాను" అని క్షణాల్లో బైకుతో వచ్చాడు.

త్రిపురం ఇంటికి చేరే లోపల మానసికంగా పరిపరివిధాల ఆలోచనలతో బాధపడుతూనే ఉంది. తన తల్లికి అనారోగ్యం ఎక్కువయినప్పుడల్లా త్రిపురానికి లోకమంతా శూన్యంగా కనిపిస్తుంది. ఆవిడ ఆరోగ్యం బాగుపడేదాకా గిలగిలలాడుతుంది మనసు. వారిద్దరి మధ్య అటాచ్‌మెంట్ అధికం.

త్రిపురాన్ని వదిలి సాధారణంగా వర్ధనమ్మ ఎవరి దగ్గరికీ వెళ్ళదు. వెళ్ళినా వారం, పదిరోజులకంటే మించి ఉండదు. సరిగ్గా వంట కూడారాదు త్రిపురానికి. తన కూతురు ఎక్కడ అవస్థపడుతుందోనని ఆవిడ బాధ.

త్రిపురం ఇంటికి దారి చెప్పింది ఇంటిముందు ఆగాక థాంక్సు చెప్పాలన్న ధ్యాసకూడా లేకుండా లోపలికి పరిగెత్తింది.

ప్రక్కింటావిడ కనబడి చెప్పింది.

"ఫోను అందిదన్నమాట."

"ఎలా ఉంది అమ్మకి? ఎక్కడుంది?" అడిగింది త్రిపురం.

"ఆస్పత్రికి తీసుకెళ్ళారు ఎదురింటాయన ఇందాకే."

"ఏ ఆస్పత్రికి? ఏమయింది?"

"నేను లోపలికి వచ్చాను ఊరికినే. వంటగదిలో నేలమీద పడివుంది ఆవిడ. నాకు కంగారు వేసి ఎదిరింటాయన్ని పిల్చాను. మీ ఫేమిలీ డాక్టర్ దగ్గరికి తీసుకెళ్ళారాయన."

త్రిపురం మళ్ళీ బయటికి వచ్చింది వేగంగా. ఆమె స్టూడెంటు ఇంకా బయటే ఉన్నాడు. వెళ్ళాలో, ఉండాలో తెలియక.

"లెట్స్ గో దారి చూపిస్తాను" అన్నది.

త్రిపురం కంఠంలోని వణుకుని గుర్తించాడు అతను. వెంటనే స్టార్టు చేసాడు బండిని. ఆస్పత్రి ముందాగింది బండి. లోపలికి పరుగెత్తింది త్రిపురం.

✷✷✷

(ఇంకావుంది)




Click here to go to KOUMUDI Library

ఈ నవల క్రిందటి భాగం ఇంకా చదవలేదా..? లేక మళ్ళీ ఒకసారి చదువుదామనుకుంటున్నారా? వెంటనే కౌముది గ్రంథాలయాన్ని సందర్శించండి..

**NEW**
Click here to share your comments on this story